క్లుప్తంగా

ఉంగుటూరు తహసీల్దారుగా పి.సతీష్ నియామకం


పొట్టు సతీష్

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దారుగా పొట్టు సతీష్ నియమితులయ్యారు. ఎన్నికలకు ముందు వరకు ద్వారకాతిరుమల తహసీల్దారుగా, ఎన్నికల సమయంలో మచిలీపట్నంలో సతీష్ పని చేశారు. అంతకుముందు కొయ్యలగూడెం ఆర్ఐగా, పోలవరం డీటీగా, జాయింట్ కలెక్టర్ సీసీగా, కలెక్టరేట్‌లో ల్యాండ్ విభాగం సూపరింటెండెంటుగా సతీష్ పనిచేశారు. మంగళవారం ఆయన ఉంగుటూరులో బాధ్యతలు చేపడతారు.

ఆశీర్వాద పండుగలు ప్రారంభం


ప్రసంగిస్తున్న పాస్టర్ సిల్వర్టు కుమార్

దెందులూరు: పెదపాడులోని వీజేఎల్ఎం చర్చిలో సోమవారం ఆశీర్వాద పండగను పాస్టర్ సిల్వర్టు కుమార్ ప్రారంభించారు. ఏసుక్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవించాలని ఆయన అన్నారు. వివిధ గ్రామాల నుంచి విశ్వాసులు ఆశీర్వాద పండుగలకు తరలివచ్చారు.

భోజన వితరణ పునరుద్ధరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భగవాన్ శ్రీ సత్య సాయిబాబా అనుగ్రహ ఆశీస్సులతో ప్రతి సోమవారం పోలీసు శాఖలో స్పందనకు వచ్చే అర్జీదారులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ద్వారా భోజన ప్రసాద వితరణ పునరుద్ధరించినట్టు ఆ సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు తెలిపారు. భోజన వితరణ ఇటీవల జరిగిన ఎన్నికల కారణంగా తాత్కాలికంగా ఆగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి భోజన వితరణ కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ బి.స్వర్ణకుమారి పునః ప్రారంభించారు. సత్యసాయి సేవా సంస్థ ద్వారా చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా 60 మంది వరకు భోజనం స్వీకరించారు. ఏలూరు సబ్ జోన్ కోఆర్డినేటర్ వై.వెంకటేశ్వరరావు, జాయింట్ కోఆర్డినేటర్ పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

9న కార్పొరేట్స్ క్విట్ ఇండియా నిరసనలు

ఏలూరు (టూటౌన్): అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని కోరుతూ ఈ నెల 9న క్విట్ ఇండియా డే సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కార్పొరేట్ క్విట్ ఇండియా నినాదంతో చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపు నిచ్చింది. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం సోమవారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం (అన్నేభవనం, స్ఫూర్తి భవన్) నాయకులు కె.శ్రీనివాస్, డేగా ప్రభాకర్, రాయంకుల లక్ష్మణరావు, బీకేఎంయూ, కాంగ్రెస్ కిసాన్ సెల్, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐకేఎంఎస్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, ఎస్ రామ్మోహన్, బద్దా వెంకట్రావు, బి.సోమయ్య, వి.సాయిబాబు, రెడ్డి శ్రీనివాస డాంగే, మన్నవ కృష్ణ చైతన్య, తలారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ల దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ వాలంటీర్లు సోమవారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎక్కువగా వాహన ప్రమాదాలు రోడ్డు భద్రతా చిహ్నాలు పాటించకపోవడమేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు రెడ్ క్రాస్ వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ వరప్రసాదరావు, ట్రాఫిక్ ఏఎస్ఐ ఏవైఆర్ రాజు, సోషల్ వర్కర్ సీహెచ్‌వీ సురేంద్ర, డాక్టర్ జి.స్పందన, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ వి.నాగరాజు, ట్యూటర్లు ఎ.ప్రియాంక, రెడ్ క్రాస్ ఏఎన్ఎం నర్సింగ్ విద్యార్థినులు, కానిస్టేబుల్స్ కె.శ్రీనివాస్, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 11, 12, 13 తేదీల్లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకం ఎగురవేయాలని రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్‌జీ పిలుపునిచ్చారు. బీజేపీ ఏలూరు జిల్లా ముఖ్యనాయకుల సమావేశం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లినేని నిర్మలా కిషోర్, శరణాల మాలతి రాణి, కట్నేని కృష్ణప్రసాద్, అంబికా కృష్ణ, కొర్లు సుధాకర్ కృష్ణ, పలువురు యువకులు పాల్గొన్నారు.

ముంచిన మురుగు కోడులు

- తేరుకోని పంట పొలాలు
- ఆందోళనలో రైతులు
- 400 ఎకరాల్లో దెబ్బతిన్న వరి నాట్లు


కాకర్లమూడి ఆయకట్టులో పంట పొలాల్లో వరద నీరు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం డెల్టాలోని రెండు మురుగు డ్రెయిన్లు ఆక్రమణకు గురై నీరు లాగకపోవడంతో మూడు గ్రామాల ఆయకట్టులో 450 ఎకరాల్లోని వరి నాట్లు నీట మునిగి కుళ్లిపోయాయి. జూలైలో రెండు పర్యాయాలు కురిసిన భారీ వర్షాలకు ముంపుబారిన పడిన వరి నాట్లు, నారుమళ్లు దెబ్బతిన్నాయి. దాంతో మూడు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్య విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి మొర పెట్టుకుంటున్నారు. ప్రధానంగా మండలంలోని డెల్టాలోని ప్రధాన గ్రామాల్లో దొంతవరం, కాకర్లమూడి, ఉప్పరగూడెం, రావులపర్రు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలను ఆనుకుని రంగరావుకోడు, రాచకోడు, దొంతవరం డ్రెయిన్లు ఉన్నాయి. ఈ రెండు డ్రెయిన్లు మండలంలో మేజరు డ్రెయిన్‌లో ఒకటైన పందికోడు ఆక్రమణకు గురై వరద నీరు లాగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాకర్లమూడి నుంచి ఉప్పరగూడెం మీదుగా సీతారామ పురం వైపు వెళ్లే రంగరావుకోడులో పూర్తిగా గుర్రపు డెక్క, తూడు అల్లుకుపోయి నీరు కిందికి దిగడంలేదు. దొంతవరం నుంచి రాచూరు వరకు ఉన్న కోడులో తూడు పేరుకుపోయింది. ఈ రెండు డ్రెయిన్లకు రాచూరు, శీతారామపురం ఆయకట్టులో మొత్తం చెరువులు విస్తరించి ఉన్నాయి. ఆ చెరువులు తవ్విన సమయంలో ఆ తరువాత చెరువులును ఆనుకుని ఉన్న రెండు కోడులు ఆక్రమణకు గురయ్యాయి. ఈ ఏడాది రెండు దఫాలుగా నెలరోజులు వ్యవధిలో కురిసిన వర్షాలకు వేసిన నాట్లు మొత్తం నీటిలో ఉండిపోయి కుళ్లిపోయాయి. దాంతో రెండోసారి నారుమళ్లు వేశారు. అవికూడా వర్షాలకు నీటమునిగి పాడైపోయాయి. మురుగు డ్రెయిన్లు నీరు లాగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూడుకుపోయిన డ్రెయిన్లు



వర్షాలు వస్తే మా పొలాలు తరచూ ముంపునగురై అనేక ఇబ్బందులు పడుతున్నాం. చాలా పొలాల్లో చేపల చెరువులు తవ్వేయడం వల్ల డ్రెయిన్లు పూడుకుపోయాయి. దీంతో వర్షం నీరు కిందికి పారడంలేదు.

– కాటి కిరణ్, రైతు, దొంతవరం

ప్రకృతి వైపరీత్యాలకు ఏటా నష్టం



ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు రైతులు నష్టపోయారు. డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలి. కాలువల్లో పూడిక తొలగిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. ప్రకృతి వైపరీత్యాలకు తాము ఏటా బలి అవుతున్నాము.

– కానూరి శ్రీను,కాకర్లమూడి, రైతు

ఆక్వా చెరువులతో ఇబ్బంది



ఆక్వా చెరువులు తవ్వినప్పటి నుంచి అధిక వర్షాలు కురిస్తే మురుగు కోడుల నుంచి ముంపునీరు కిందికి వెళ్లడం లేదు. నక్కల కోడు నుంచి నీరు లాగటంలేదు. పందికోడు గట్లు ఆక్రమణలకు గురయ్యాయి. పంట చేలు రెండోసారి నీట మునిగాయి. – కొవ్వలి మహేష్, రైతు, దొంతవరం

ఆక్రమణలు తొలగించాలి



డ్రెయిన్లు ఆక్రమణను తొలగించి, విస్తరణ పనులు చేపట్టాలి. డ్రెయిన్లలో పూడిక తొలగిస్తేనే గాని ముంపు బాధలు తొలగవు. పంట కాలువలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క అడ్డుపడి నీటిప్రవాహ వేగం తగ్గింది.

– నాగపండు, రైతు, కాకర్లమూడి

పాఠశాలల్లో శుభ తిథి భోజనం


పాతూరు పాఠశాలలో చిన్నారులకు లడ్డూలను వడ్డిస్తున్న దాతలు

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో శుభతిథి భోజనం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. వాస్తవానికి శుభతిథి భోజనం కార్యక్రమాలు గత నెల 29న ముగిశాయి. ఆ తర్వాత కూడా దాతలు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో భోజనం కార్యక్రమాలు పలు పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు స్వీట్లు, పలు రాకల పిండి వంటలు, పండ్లు స్వచ్ఛందంగా అందిస్తున్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాల, దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెంలోని యూపీ పాఠశాలలో సోమవారం దాతలు చిన్నారులకు స్వీట్లు, మిక్చర్‌లను అందించారు. పాతూరు పాఠశాలలో దాత అక్బర్ సత్తార్‌బీబీ ఆర్థిక సాయంతో చిన్నారులకు లడ్డూలు, కారపు మిక్చర్ చిన్నారులకు భోజనంతో వడ్డించారు. అన్నేవారిగూడెంలో దాత తుంగా లక్ష్మణరావు చిన్నారులకు స్వీట్లు అందించారు. దాతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎం ఎస్‌కే మస్తాన్, పి.నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో... కూరగాయాలు


గణపవరం సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గణపవరం: కూరగాయలు లేకుండా ఏ కుటుంబానికీ పూట గడవదు. అందరికీ ప్రతిపూట భోజనంలోకి కూర ఉండాల్సిందే. అలాంటి కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్క కూరగాయల కొనుగోలు పైనే ప్రతి కుటుంబ నెలవారీ ఖర్చు రూ. వెయ్యి వరకూ పెరిగి పేదలు లబోదిబోమంటున్నారు. డైలీ మార్కెట్‌లో కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వారపుసంతకు వచ్చినా అక్కడా ధరలు మోత మోగిస్తున్నాయి.

వారపు సంతలో ధరలు ఇలా..

గణపవరంలో సోమవారం నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. దీనితో వినియోగదారులు సగానికి సగం తగ్గించి కొనుగోలు చేశారు. వివిధ రకాల కూరగాయల ధరలూ ఇలా ఉన్నాయి. ఉల్లి కిలో రూ.40, పచ్చిమిర్చి రూ.80, బీర రూ.60, వంకాయలు రూ.80, బెండ రూ.60, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.50, దోస రూ.40, దొండ రూ.60, కాకర రూ.60, కీరదోస రూ.80, కంద రూ.50, చిక్కుడు రూ.120, టమాట రూ.70, అల్లం రూ.160, మునగ రూ.10, ఆనబ రూ.30 చొప్పున పలికాయి. ఆకుకూరల ధరలూ భగ్గుమన్నాయి. తోటకూర, గోంగూర, పాలకూర కట్ట రూ.20 చొప్పున విక్రయించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


ఎ.గోపవరంలో బాల్యవివాహాలపై ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గణపవరం: బాల్యవివాహాలు చట్టపరంగా, సామాజికంగా నేరమని ఎ.గోపవరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుమ్మడి చంద్రావతి అన్నారు. సోమవారం గోపవరంలో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస వివాహ వయస్సు రాకుండా వివాహం చేస్తే శిక్షార్హులవుతారన్నారు. బాల్య వివాహం చేస్తే వరునికి ఏడేళ్లు, తల్లిదండ్రులకు రెండేళ్ల జైలు శిక్షలతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రీరామరక్ష


గణపవరం: అవగాహన ర్యాలీలో గణపవరం పీహెచ్‌సీ సిబ్బంది


భీమడోలు: కురెళ్లగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గణపవరం: తల్లిపాలు అమృత సమానమని, బిడ్డల ఆరోగ్యానికి జీవితాంతం రక్షణ కల్పిస్తాయని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పని సరిగా ఇవ్వాలని, పుట్టిన బిడ్డకు మురిపాలు ఇవ్వాలని సూచించారు. పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇస్తే రోగనిరోధక శక్తి పెరిగి బిడ్డకు జీవితాంతం రక్షణ కల్పిస్తుందన్నారు. ముర్రపాలు తాగిన బిడ్డ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని అన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఐసీడీఎస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: అమ్మ పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ పూళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ నూర్జహాన్ అన్నారు. ప్రపంచ తల్లి పాలు వారోత్సవాల్లో భాగంగా సోమవారం పూళ్ల సెక్టార్ పరిధిలోని పూళ్ల, కురెళ్లగూడెం, అంబర్‌పేట, దుద్దేపూడి, అన్నేవారిగూడెం, కోడూరుపాడులో తల్లి పాల విశిష్టతను చాటుతూ వీధుల్లో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాలు ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు, తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్.. ఇంటింటా కాంతులు

- పీఎం సూర్యఘర్ పథకంతో నిరంతర వెలుగులు
- గృహవినియోగదారులను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- విద్యుత్ సమస్యలు, బిల్లు మోతకు చెక్


దెందులూరులో సాయిబాబా ఆలయంపైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

దెందులూరు: సోలార్‌తో ఇంటింటా నిరంతరాయంగా విద్యుత్ కాంతులు వెదజల్లడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీయోజనను అమలు చేస్తోంది. భవనం పై భాగంలో సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించి ఆదాయం పొందవచ్చు. నిరంతర విద్యుత్‌తో పాటు విద్యుత్ అంతరాయాలు, లోఓల్టేజ్, విద్యుత్ బిల్లుల సమస్యలకు చెక్ పెట్టేలా ఈ పథకాన్ని రూపొందించారు. పెట్టుబడి సులభంగా తిరిగిరావడంతో పాటు సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వం కూడా సబ్సిడీ అందించడంతో ఈ పథకానికి స్పందన బాగుంది. దెందులూరు నియోజకవర్గంలో విద్యుత్ వినియోగదారులు సూర్య ఘర్ పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడిప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిని చేసి వినియోగిస్తున్నారు.

ప్యానల్స్...నెట్‌మెట్రీ ఏర్పాటు

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై భాగంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే విద్యుత్ మీటరు స్థానంలో నెట్‌మెట్రీ ఏర్పాటు చేసి దీని ద్వారా సోలార్ విద్యుత్ వినియోగాన్ని లెక్కిస్తారు. అదనపు విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు.


సులభంగా పెట్టుబడి వెనక్కి

సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి ఆరు, ఏడేళ్లలో తిరిగి వస్తుంది. సూర్య ఘర్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాలో రాయితీ జమ చేస్తారు. ముందుగా వినియోగదారుడి తమ బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ విద్యుత్ ఉత్పత్తికి 3–4 ప్యానల్స్‌ను వినియోగిస్తారు.

పథకం పొందండి... ఇలా

- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలి.
- పథకం కోసం మొబైల్‌లో సూర్యఘర్ యాప్‌ను అప్‌లోడ్ చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగదారుడి వివరాలు నమోదు చేయాలి
- ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలను జత చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- రిజిస్ట్రేషన్ ఫీజు కిలోవాట్స్‌ను బట్టి చేయించుకోవాలి
- 5 వాట్స్‌కు రూ. 1,900, 5 వాట్స్ పైబడితే రూ.5,900 చెల్లించాలి, 10 కిలోవాట్స్ పైబడిన హెచ్‌డీ సర్వీసుదారులు రూ.11,800 చెల్లించాలి.
- 3కిలో వాట్స్‌కు సర్వీసులకు ఫీజు లేదు. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తరువాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి.
- కిలో వాట్ ఆధారంగా సబ్సిడీ మంజూరు చేస్తారు.
- మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు.
- వినియోగదారులు వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది.

స్పందన బాగుంది



దెందులూరు నియోజకవర్గంలో సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తులు వస్తున్నాయి. ప్రజల నుంచి విశేష స్పందన ఉంది. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు నిరంతర విద్యుత్ పొందవచ్చు. పెట్టిన పెట్టుబడి త్వరగానే వస్తుంది. రూఫ్‌టాప్ కోసం విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయవచ్చు.

– పి.సాల్మన్ , ఎస్ఈ, ఏలూరు ట్రాన్స్‌కో


స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ నిరంతర విద్యుత్ సౌకర్యాన్ని పొందాలి. ప్రజలందరికీ తక్కువ ధరకు విద్యుత్ వినియోగం పొందడానికి సోలార్ వినియోగంపై స్వచ్ఛంద సంస్థలను సామాజిక బాధ్యతగా ప్రచారంలో భాగస్వాములు కావాలి.ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

– సీహెచ్. అవినాష్‌రాజు, లయన్స్ క్లబ్ డైరెక్టర్, పెదవేగి

రైతులకు మరింత మేలు



గృహ అవసరాలతో పాటు దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రైతులకు సోలార్ విద్యుత్ వాడకం మరెంతో మేలు చేస్తుంది. రైతు సంఘాలు, రైతు నాయకులు సోలార్ విద్యుత్ వినియోగంపై మరింత అవగాహన కల్పించాలి. మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు ప్రయోజనాలను వివరిస్తూ ప్రచారం చేయాలి.

– వీరమాచినేని శివాజీ, ఆదర్శ రైతు, దెందులూరు

రుణాలు మంజూరు చేయాలి

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం లీడ్‌క్యాప్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు మంజూరు చేయాలని దళితసేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ లీడ్ క్యాప్ ద్వారా చర్మకారుల ఆర్థికాభివృద్ధి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీల ఆర్థికాభివృద్ధి, బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీల ఆర్థికాభివృద్ధి జరగాలంటే రుణాల మంజూరు ఒక్కటే మార్గమన్నారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో రుణాలు మంజూరు కోరారు.

ఆంజనేయులు సేవలు మరువలేనివి

ఉంగుటూరు: బూరుగుపల్లి ఆంజనేయులు అనేక సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ మానవత సంస్థకు తోడ్పాటు అందించారని పలువురు వక్తలు అన్నారు. సోమవారం ఆయన సంస్మరణ సమావేశం చేబ్రోలులో ఆయన ఇంటివద్ద నిర్వహించారు. ఆంజనేయులు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. మానవత జిల్లా ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల చైర్మన్ గుణ్ణంబుల్లబ్బాయి, మండల కన్వీనర్ అడపా శ్రీను, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పుసులూరి ప్రకాష్ పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం ప్రమాదకరం


గణపవరం బాలికల హైస్కూల్లో విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ప్రస్తుత జీవనశైలిలో మార్పుల కారణంగా చిన్నతనంలోనే కంటికి సంబంధిత సమస్యలు వస్తున్నాయని, వీటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యసేవలు పొందాలని కంటి వైద్యనిపుణుడు ఐ.శ్రీనివాస్ అన్నారు. సోమవారం గణపవరం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి ఆరోగ్యానికి అవసరమైన ఆకుకూరలు, పాలు, గుడ్లు, ఇతర పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 380 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి, 75 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందిస్తామని సీహెచ్‌వో జాలాది విల్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలభాస్కరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేటలో మీకోసం

దెందులూరు: గ్రామ సమస్యల పరిష్కార దిశగా మీ కోసం– మీ చింతమనేని కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సీతంపేటలో ఆయన గ్రామ సభ నిర్వహించారు. సమావేశంలో పలు సమస్యలపై వినతులు ఎమ్మెల్యేకు అందించారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), అధికారులు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులున్నారు.

వాహనాల తనిఖీ

దెందులూరు: జాతీయ రహదారిపై గుండుగొలను వంతెన వద్ద సోమవారం రాత్రి దెందులూరు ఎస్సై కె.స్వామి వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్లు లేని ద్విచక్ర వాహనదారులకు మోటారు సైకిళ్లను పక్కన పెట్టించి హెల్మెట్ వినియోగం, భద్రత, భవిష్యత్‌పై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలను తనిఖీ చేశారు.రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు వైపువెళ్లే 18 వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.